సాక్షి
గుంటూరు
గురువారం । 12 । జూన్ । 2025



పున్నమి గరుడ సేవ


సత్తెనపల్లి: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో పున్నమి గరుడ సేవ నిర్వహించారు.



దేశమ్మ తల్లికి పూజలు

పెదకూరపాడు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా 75 త్యాళ్ళూరు గ్రామదేవత శ్రీదేశమ్మ తల్లికి బుధవారం శ్రీలలిత మహిళా కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగేశ్వర స్వామికి పూజలు



చేబ్రోలు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా చేబ్రోలులోని నాగేశ్వర స్వామి బుధవారం ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. పంటలు బాగా పండాలని స్వామికి పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ముగిసిన చెన్నమల్లేశ్వరుని కల్యాణ వేడుకలు



రేపల్లె: ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్రైమాసిక కల్యాణ వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూర్ణాహుతి హోమం నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం, ధాన్యకుట్టునోత్సవం, త్రిశూల స్నానాలు, పవళింపు సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వేంకటేశ్వర స్వామికి అభిషేకం





తాడేపల్లి రూరల్ : సీతానగరం విజయ కీలాద్రి దివ్యక్షేత్రంపై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి బుధవారం 81 కలశాలతో అభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో జ్యేష్ఠ నక్షత్రం సందర్భంగా ఉదయం 9 గంటలకు స్వామి వారికి 81 కలశాలతో అభిషేకాన్ని నిర్వహించామని తెలిపారు. అనంతరం హయగ్రీవ హోమం, అష్టోత్తర శతనామార్చన, పూర్ణాహుతి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

జీజీహెచ్‌లో నీటి సరఫరాకు అంతరాయం

తక్షణమే పునరుద్ధరణ



గుంటూరు మెడికల్: గుంటూరు మున్సిపాలిటీకి చెందిన ప్రధాన 'ఎ' లైన్‌లో నీటి వాల్వ్ మరమ్మతులకు గురైంది. ఈ పైపులైన్ ద్వారా గుంటూరు జీజీహెచ్‌లోని ఏడు భవనాలను నీరు సరఫరా అవుతోంది. అంతరాయం కారణంగా ఆరు భవనాలకు సరిపడా నీరు అందుబాటులో ఉండగా, ఒక భవనానికి మాత్రమే తాత్కాలికంగా నిలిచిపోయిందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి బుధవారం తెలిపారు. విషయం మున్సిపాలిటీ అధికారులకు తెలియజేయగా, 90 నిమిషాల్లోనే వాటర్ ట్యాంకర్‌ను పంపించి ఆ భవనానికి నీటిని అందించారన్నారు. నీటి సమస్య మంగళవారం ఒక్కరోజే మాత్రమే తలెత్తిందని తెలిపారు. గత నాలుగు రోజులుగా ఎటువంటి అంతరాయం లేదని తెలిపారు.

అరచేత వైకుంఠం..!

ముఖ్యమంత్రి చంద్రబాబు వంచన పాలనకు ఏడాది గడిచింది. మోసానికి పేటెంట్ ఇస్తే అది ఆయనకే చెందుతుంది. ఎన్నికల సమయంలో అలవికాని హామీలు ఊదరగొట్టడం, ఆ తర్వాత వాటిని అమలు చేయకపోవడం ఆయన నైజం. ప్రజల్ని మోసం చేయడంలో దిట్ట. ఎన్నికల ప్రచారంలో భాగంగా సూపర్ సిక్స్ గురించి ఊదరగొట్టారు. తాము వస్తే సంపద సృష్టించి, సంక్షేమం అమలు చేస్తామని పగల్బాలు పలికారు. గుంటూరులో ఏకంగా ఐటీ టవర్లు కట్టి ఉపాధి కల్పిస్తామని చిటికెల పందిళ్లు వేశారు. ఏడాది పూర్తయ్యే సరికి ఇచ్చిన వందలాది హామీల్లో ఏ ఒక్కదాన్ని నెరవేర్చలేదు. నమ్మించి మోసగించిన చంద్రబాబుపై పేద మధ్యతరగతి ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఎన్నికల్లో ఓట్లు కోసం హామీలు ఇచ్చిన ఆయన తర్వాత ప్లేటు ఫిరాయించడం, ఒక్క హామీ కూడా నెరవేర్చకుండానే సంబరాలకు సిద్ధం కావడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.



కూటమి ఏడాది పాలనంతా మోసం

- సంక్షేమం పక్కదారి
- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు
- అధికారం కోసం సూపర్ సిక్స్ వాగ్దానాలు
- గద్దె ఎక్కాక మాట మార్పు
- గాలిలో కలిసిన హామీలు
- రాజధాని పేరుతో హడావుడి
- ఇప్పటివరకు ముందుకు పడని అడుగు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ప్రస్తుత కూటమి పాలన రాష్ట్రాన్ని సంక్షేమం నుంచి సంక్షోభం వైపునకు తీసుకు వెళ్తోంది. ఐదేళ్ల వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూశారు. ఎన్నికల్లో తర్వాత మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి పాలన ఏరు దాటాకా తెప్ప తెగలేసిన చందంగా ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్ మాత్రమే పెంచిన కూటమి ప్రభుత్వం మిగిలిన పథకాలన్నింటికి తిలోదకాలు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

అమలుకాని హామీలు



గుంటూరులో భూగర్భ డ్రైనేజీని పూర్తి చేస్తానని చంద్రబాబు చెప్పారు. ఇప్పటివరకూ దీనిపై అడుగు ముందుకు పడలేదు. ముస్లింలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తాం.. ముఖ్య పట్టణాల్లో ఈద్గాలకు, ఖబరస్తాన్‌లకు స్థలాలు కేటాయిస్తాం.. హజ్ యాత్రకు లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేస్తాం.. నూర్‌బాషా కార్పొరేషన్ పెట్టి ఏడాదికి వంద కోట్ల రూపాయల ఆర్థిక సాయం చేస్తాం.. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇచ్చే బాధ్యత నాదంటూ గుంటూరు పర్యటనలో చంద్రబాబునాయుడు హామీలు ఇచ్చారు. ఈ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు.గుంటూరులోనే ఐటీ టవర్లు కట్టి వర్క్ ఫ్రం హోం విధానం తీసుకొస్తామని చెప్పారు. అభివృద్ధి చేయకపోగా అవినీతికి గేట్లెత్తేశారు. అన్నదాతలను రోడ్డున పడేశారు. ఈ ఏడాది తుపాన్లు, వర్షాలకు రైతన్నలు పూర్తిగా నష్టపోయారు. రైతులను పెట్టుబడి సాయం కూడా అందలేదు. వరి, మిర్చి, పొగాకు, జొన్న, కంది, పత్తి రైతులు పూర్తిగా దెబ్బతిన్నారు.

ఇచ్చింది. సూపర్ సిక్స్‌లో ఇప్పటి వరకూ ఒక్కటీ అమలులోకి రాలేదు. ప్రజలకు ఆర్థికంగా చేయూత లేకపోవడంతో కొనుగోలు శక్తి క్షీణించింది. మార్కెట్‌లో వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది.

ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

నెలనెలా అప్పులు చేస్తూ ప్రభుత్వం నెట్టుకొస్తోంది. రాజధాని పేరుతో చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం మినహా మరే వ్యాపారం సాగడం లేదు. దీంతో ఏడాది కూడా గడవకముందే కూటమి పాలనపై ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొని ఉంది. సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు, ప్రతిపక్ష పార్టీ నేతలపై తప్పుడు కేసులు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై పెడుతున్న దృష్టిని ప్రజల సంక్షేమం మీద పెట్టడం లేదు. 'బాబు ష్యూరిటీ – భవిష్యత్‌కు గ్యారెంటీ' అంటూ ఇంటింటికీ కరపత్రాలు పంచారు. అధికారంలోకి వచ్చిన రెండునెలల తర్వాత మాట మార్చారు. అసలు సూపర్ సిక్స్ హామీలను చూస్తుంటేనే భయం వేస్తుందంటున్నారు. ''మనం హామీలిచ్చాం. సూపర్ సిక్స్ చెప్పాం. చూస్తే భయమేస్తోంది. ముందుకు కదల్లేకపోతున్నాం. ఈ విషయాలు రాష్ట్ర ప్రజానీకం కూడా ఆలోచించాలి'' అంటూ చంద్రబాబునాయుడు కొత్త పల్లవి అందుకున్నారు.

అడ్రస్ లేని ఉచిత బస్సు



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అడ్రస్ లేకుండా పోయింది. ఆగస్టు 15 నుంచి అని చెబుతున్నా దాన్ని కూడా జిల్లాకే పరిమితం చేసే అవకాశం ఉంది. గుంటూరు రీజియన్ పరిధిలో ప్రతి రోజూ వచ్చే ఆదాయం రూ. 60 లక్షలు. ప్రస్తుతం ఆర్టీసీ లెక్కల ప్రకారం 50 శాతానికి మించి మహిళలు ప్రయాణిస్తుంటారు. ఉచితం ప్రకటిస్తే వారి సంఖ్య మరింత పెరగవచ్చు. 50 శాతం లెక్క తీసుకున్నా రోజుకు 30 లక్షల రూపాయల చొప్పున ఏడాదికి 109 కోట్ల రూపాయలు మహిళలకు లబ్ధి కలుగుతుంది. ఈ ఉచితం ఇవ్వకపోవడం వల్ల ఈ మేరకు జిల్లా మహిళలు నష్టపోయారు.

లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం



గుంటూరు జిల్లాలో పూర్తిగా మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగమే నడుస్తోంది. పోలీసులు ఏ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నా లోకేష్ అండ్ టీం అనుమతి ఉండాల్సిందే. లేకపోతే కేసు కూడా నమోదు కాని పరిస్థితి నడుస్తోంది. ముఖ్యంగా సోషల్‌మీడియా ఫిర్యాదులైతే పూర్తిగా తెలుగుదేశం పార్టీ వారు ఇచ్చిన వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రతిపక్షాల నుంచి ఎవరు ఫిర్యాదు చేసినా అది బుట్టదాఖలే అవుతోంది. సోషల్ మీడియా కేసులు, వైఎస్సార్‌సీపీ నేతలపై పెడుతున్న కేసుల విషయంలో వారి వైఖరి ప్రశ్నార్థకంగా మారింది. ఒకే కేసులో ఒకే విషయంపై పలుచోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి వేధింపులకు పాల్పడుతున్నారు. గుంటూరు జిల్లాలో సోషల్‌మీడియా కార్యకర్తలపై పలు కేసులు పెట్టి జైలుకు పంపారు. కోర్టులు అక్షింతలు వేస్తున్నా పోలీసుల వైఖరి మారడం లేదు. చినబాబు రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు.

బాబు మోసాల చిట్టా



- తల్లికి వందనం కింద సంవత్సరానికి ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 15,000 ఇచ్చే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. ఇప్పుడు ఇస్తామని చెబుతున్నా ఎవరికి వస్తుందో, ఎవరికి రాదో అన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే ఉంది.
- ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు అందిస్తామన్నారు. ఇప్పటి వరకూ ఒక్క మహిళకు కూడా ఉచిత గ్యాస్ సిలెండర్ల తాలూకు డబ్బులు జమ కాలేదు.
- ఆడబిడ్డల కోసం మహాశక్తి కార్యక్రమాన్ని తెస్తామన్నారు. ప్రతీ మహిళకు నెలకు రూ. 1500లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తామన్నారు.
- అన్నదాతకు అండగా ఏడాదికి రూ. 20 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకు పైసా విదల్చలేదు.

యువతకు మొండి చెయ్యి



యువతకు ఉపాధి కల్పిస్తాం.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటికొకరికి ఉద్యోగం ఇస్తాం .. లేదంటే రూ. 3 వేలు భృతి ఇస్తామంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు, ముఖ్యంగా చంద్రబాబునాయుడు ఊదరగొట్టారు. యువతను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం చేస్తాం.. పరిశ్రమలు తెస్తాం.. ఉద్యోగాలిస్తాం అంటూ ఊదరగొట్టారు. గుంటూరు జిల్లాలో 5,58,000 కుటుంబాలు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నాయి. ఇప్పుడు కొత్త ఉద్యోగాల సంగతి పక్కన పెడితే నిరుద్యోగ భృతి కూడా ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. ముఖ్యమంత్రి యువ నేస్తం పథకం కుటుంబంలో ఎవరికైనా పెన్షన్ వస్తే ఇవ్వమని, కనీస ఆదాయం పదివేల రూపాయలకు మించి ఉండకూడదని మెలిక పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐదు ఎకరాల కంటే సాగు భూమి ఉండకూడదని, పట్టణ ప్రాంతాలలో 1500 చదరపు అడుగుల నివాస స్థలం ఉండకూడదనే షరతులను ప్రభుత్వం పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగాలకు కనీస వయోపరిమితి 45 సంవత్సరాలు ఉంటే ముఖ్యమంత్రి యువ నేస్తం నిరుద్యోగ భృతి పథకానికి 35 సంవత్సరాలుగా నిర్ణయించడం సరి కాదని విద్యార్థి, యువజన సంఘాలు అంటున్నాయి. వయోపరిమితి 45 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం ఇప్పటి వరకూ నోరు మెదపలేదు.

750 మంది ఎస్జీటీలకు స్థాన చలనం



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న జేడీ శైలజ, గుంటూరు డీఈవో సీవీ రేణుక



హాజరైన ఉపాధ్యాయులు

- మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు
- నేడు 750 నుంచి 1,750 వరకు నిర్వహణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న 750 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (ఎస్జీటీ) వేర్వేరు పాఠశాలలకు బదిలీ అయ్యారు. ఉపాధ్యాయుల ఆందోళన ఫలితంగా వెబ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి మాన్యువల్ విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో బదిలీల ప్రక్రియ చేపట్టారు. సీనియార్టీ జాబితాలోని వరుస క్రమంలో ఒకటి నుంచి 750 వరకూ పేర్లు ఉన్న ఎస్జీటీ (తెలుగు)లను పిలిచిన విద్యాశాఖాధికారులు, పాఠశాలల్లోని ఖాళీలను డిస్‌ప్లే చేసి, ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి రోజు లాంగ్ స్టాండింగ్ విభాగంలో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో శారీరక వైకల్యం గల ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లదలచుకున్న పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల డీఈవోలు సీవీ రేణుక, చంద్రకళతో పాటు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి పరిశీలకురాలిగా వచ్చిన జేడీ సర్వీసెస్ పి. శైలజ కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలించారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్లు రమణ, శైలజ, ఏపీఎస్‌డీఎంఏ డీపీఎం ఏ. లక్ష్మీకుమారి, డ్వామా పీడీ వి. శంకర్, ఎంఈవోలు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తడ'బడి'న చదువులు

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు
- అసంపూర్తిగా తరగతి గదులు, టాయిలెట్ల నిర్మాణం
- పూర్తిస్థాయిలో రాని స్టూడెంట్స్ కిట్లు
- ఆరు మండలాలకే పరిమితమైన యూనిఫాం పంపిణీ
- పెద్దసంఖ్యలో మూలనపడిన ఆర్వో ప్లాంట్లు
- నాడు–నేడు రెండో దశ పనులు పూర్తి చేయని కూటమి ప్రభుత్వం
- విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలకనున్న బడులు
- గుంటూరు జిల్లాలో బడిబాట పట్టనున్న మూడు లక్షల మంది విద్యార్థులు
- ప్రభుత్వ బడుల్లో 93,464 మందికి అందాల్సిన కిట్లు



కొండా వెంకటప్పయ్య కాలనీలోని కేఎస్ఆర్‌టీ కార్పొరేషన్ హైస్కూల్



ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం కార్పొరేషన్ హైస్కూల్

గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి సెలవుల అనంతరం జిల్లాలోని పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ విద్యార్థులకు మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం వరుసగా నాలుగేళ్లపాటు విద్యాకానుక కిట్లను పాఠశాల తెరిచిన రోజునే పక్కాగా పంపిణీ చేసింది. నాడు–నేడు ద్వారా సకల వసతులతో ఆధునికీకరించింది. పాఠశాలలు విద్యార్థులకు సకల వసతులతో స్వాగతం పలికాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏడాదిగా ప్రభుత్వ పాఠశాలలు కళతప్పాయి. గురువారం నిలిచిపోయిన తరగతి గదులు, మూలనపడిన ఆర్వో ప్లాంట్లు విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 1,730 పాఠశాలలకు మూడు లక్షల మంది విద్యార్థులు వెళ్లనున్నారు. ఇందులో 1,074 ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 93,464 మంది విద్యార్థులున్నారు. 656 ప్రైవేటు పాఠశాలల పరిధిలో మరో 2,60,354 మంది విద్యార్థులు ఉన్నారు.

ఆరు మండలాలకే పరిమితమైన యూనిఫాం పంపిణీ

జిల్లాలోని 18 మండలాల పరిధిలో 1,074 పాఠశాలల వారీగా 93,464 మంది విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేయాల్సి ఉంది. కిట్‌లో భాగంగా అందించే పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్, వర్క్‌బుక్స్, బ్యాగులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, పిక్టోరియల్ డిక్షనరీలు మండల స్టాక్ పాయింట్లకు చేర్చినట్లు సమగ్రశిక్ష అధికారులు చెబుతున్నారు. అయితే, యూనిఫాం బుధవారం సాయంత్రానికి కేవలం ఆరు మండలాలకే సరఫరా అయ్యింది. కిట్ల పంపిణీపై ఇప్పటి వరకూ స్పష్టత లేదు.

జగన్ పాలనకు ముందు అంతా అధోగతి

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు కేవలం పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీకే పరిమితమైంది. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రూపుదిద్దుకున్న విద్యాకానుక స్టూడెంట్ కిట్లను పేద, మధ్య తరగతి విద్యార్థులకు 10 రకాల సామగ్రితో ఉచితంగా పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వరుసగా నాలుగేళ్లపాటు నిరాటంకంగా విద్యార్థులకు అందజేసింది.



పూర్తికాని నేతాజీనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ స్కూల్



స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య కార్పొరేషన్ పాఠశాల

నాడు-నేడు రెండో దశ పనులపై నిర్లక్ష్య వైఖరి

2014–19 మధ్య టీడీపీ పాలనలో శిథిలావస్థకు చేరి, సమస్యలతో కునారిల్లిన ప్రభుత్వ పాఠశాలలకు వైఎస్సార్ సీపీ సర్కారు ప్రాణం పోసింది. నాడు–నేడు ద్వారా సకల వసతులతో ఆధునికీకరించింది. నాడు–నేడు మొదటి దశలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1,183 పాఠశాలలను రూ.283 కోట్లతో కార్పొరేట్‌కు దీటుగా ముస్తాబు చేసింది. నాడు–నేడు రెండో దశలో ఒక్క గుంటూరుజిల్లాలోనే 563 పాఠశాలలను రూ.202 కోట్లతో 10 కాంపొనెంట్ల వారీగా పనులు చేపట్టింది. ప్రభుత్వం దిగిపోయే నాటికి దాదాపు 80 శాతానికి పైగా పూర్తయ్యాయి. వీటిలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చేపట్టిన 600 తరగతి గదుల నిర్మాణాలు సైతం ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే నాడు–నేడు పనులను అటకెక్కించింది. ఒక్కో పాఠశాలకు కేవలం రూ.ఐదు లక్షలు ఖర్చు పెడితే పూర్తయ్యే అవకాశమున్నచోట సైతం నిర్లక్ష్య వైఖరితో పనుల నిలిచిపోయాయి. అదనపు తరగతి గదులకు సిమెంట్, ఇసుక సరఫరా చేయకపోవడంతో సివిల్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. నాడు–నేడు మొదటి దశలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీటి సరఫరా కోసం పంపిణీ చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్లను సైతం పక్కన పడేశారు. రెండో దశలో ఎంపిక చేసిన పాఠశాలలకు ఆర్వో వాటర్ ప్లాంట్లు సరఫరా చేసినప్పటికీ వాటిని ఇన్‌స్టాలేషన్ చేయకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్యకు ఇచ్చిన భరోసా ఏడాది కూటమి పాలనలో కరువైంది.

'శారద' వంటి చరితార్థులే యువతకు ఆదర్శం

- 'సాహిత్య బాటసారి శారద' పుస్తకావిష్కరణలో ప్రముఖ రచయిత శివశంకర్
- హాజరైన శారద, ఆలూరి భుజంగరావు కుటుంబ సభ్యులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, శివశంకర్, రవిబాబు, శివప్రసాద్ తదితరులు

తెనాలి: ఒకవైపు పేదరికం...మరోవైపు మూర్ఛవ్యాధితో బాధపడుతూ దుర్భరమైన హోటల్ పనిలో గడుపుతూనే తెలుగు నేర్చుకుని 'శారద' అనే కలంపేరుతో దశాబ్దాల పాటు మనగలిగిన సాహిత్యాన్ని సృజించిన ఎస్.నటరాజన్ వంటి చరితార్థులను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత పాపినేని శివశంకర్ సూచించారు. ఆలూరి భుజంగరావు 1985 నాటి రచన 'సాహిత్య బాటసారి శారద..స్మృతి శకలాలు' పుస్తకాన్ని శారద శతజయంతి సందర్భంగా 'తెనాలి ఇంప్రెషన్స్' ప్రచురించింది. 'అరసం', గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో బుధవారం ఏర్పాటైన సభకు వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తమిళనాడులోని పుదుక్కోటైలో జన్మించిన నటరాజన్, 12 ఏళ్ల వయసులో తెనాలి వచ్చి, హోటల్ కార్మికుడిగా చేస్తూ సాహితీ దిగ్గజంగా ఎదగడం అపూర్వమన్నారు. ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవి బాబు భాష, సాహిత్యంతోనే మనిషి ఉన్నతంగా ఎదుగుతారని చెప్పారు. తెలుగుభాషను, సాహిత్యాన్ని చదవాలని 'అరసం' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ సూచించారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు 'శారద' పరిచయం మంచి విషయమన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు స్వాగతం పలికిన సభలో ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, ఉమా రాజశేఖర్‌తోపాటు 'శారద' కుమారులు సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణమూర్తి, కుమార్తె శారద, ఆలూరి భుజంగరావు కుమార్తె ఉషారాణి పాల్గొని ప్రసంగించటం విశేషం. కార్యక్రమంలో ముత్తేవి రవీంద్రనాథ్, మొవ్వా సత్యనారాయణ, డాక్టర్ కె.రామరాజు, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, లలితానందప్రసాద్, 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు, జుగాష్ విలి, సజ్జా వెంకటేశ్వర్లు, ఎం.రామలింగేశ్వరరావు, కొండముది రమేష్ బాబు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

లక్ష్మీపురం: అమరావతి రోడ్డులోని నారాయణ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా పాఠ్య పుస్తకాలను వేల రూపాయలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందారపు యశ్వంత్ డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల వద్ద నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ నారాయణ పాఠశాల యాజమాన్యం అధిక ఫీజులతో దోపిడీలకు పాల్పడుతోందని విమర్శించారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి అక్రమంగా పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న నారాయణ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు గండు శివ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నారాయణ, చైతన్య స్కూల్లో జరుగుతున్న అక్రమ అడ్మిషన్లను, ఫీజుల దోపిడీలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి అమర్నాథ్, నగర సహాయ కార్యదర్శి వెంకట్, నగర నాయకులు అజయ్, భాస్కర్, చందు, సాయి గణేష్, సాయి, టి. అజయ్, సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా అథ్లెటిక్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా అథ్లెటిక్ జట్టు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న ఏపీ సీనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేశామని జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14వ తేదీ ఉదయం 6 గంటలకు పోటీలు జరిగే ప్రాంతంలో కోచ్ రవికుమార్‌కు వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డును అందించాలని సూచించారు.

ఎంపికైన జట్టు

పురుషులు: కృష్ణం నాయుడు, మొహిద్దీన్, రోషన్, వెంకట్ గురు శంకర్, ముజ్బర్, మదన్‌మోహన్, యుగంధర్, ప్రసన్న కుమార్, ప్రవీణ్ కుమార్, సుబ్రహ్మణ్యం, మణికంఠ నాయక్, అబ్దుల్లా, అశోక్, ప్రేమ్‌చంద్, తిరుపతిరావు, రాజమోహన్, ఎస్.శంకర్, దీపు, భరత్ కుమార్, డి.మణికంఠ

మహిళలు: ఎస్‌కే ఆషా, కె.అంకమ్మ, డి.వైష్ణవి, కె.రేష్మి, కృష్ణ రచన

డీఏఓగా నరసింహారావు బాధ్యతల స్వీకరణ



కొరిటెపాడు(గుంటూరు): జిల్లా వ్యవసాయ అధికారిగా (డీఏఓ) యు.నరసింహారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యవసాయ అధికారిగా పని చేసిన నున్నా వెంకటేశ్వర్లు నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో బదిలీపై వచ్చిన నరసింహారావు జిల్లా వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించేలా కృషి చేస్తానని తెలిపారు. అయితే, నరసింహారావు ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన తర్వాత జిల్లా వ్యవసాయ అధికారిగా కడప జిల్లా డీడీఏగా పనిచేస్తున్న ఎ.నాగేశ్వరరావు బాధ్యతలు తీసుకోనున్నారు.

వృద్ధురాలి నేత్రదానం



ప్రత్తిపాడు: తాను మరణించినా నేత్రాలు మూతపడకూడదని భావించిన ఓ వృద్ధురాలు వాటిని దానం చేశారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు గ్రామానికి చెందిన వృద్ధురాలు మండెపూడి హేమలత (66) నేత్ర దానం చేసి మరణానంతరం మరొకరికి ఈ లోకాన్ని చూసే అవకాశాన్ని కల్పించారు. హేమలత బుధవారం గొట్టిపాడులోని స్వగృహంలో మధ్యాహ్నం కన్నుమూశారు. ఆమె కోరిక మేరకు నేత్రాలను శంకర కంటి ఆస్పత్రి డాక్టర్ శ్రీనిజ బృందం సేకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొల్లిపరలో 45.2 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 45.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 2.4 మి.మీ. పడింది. సగటున 21.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కాకుమాను మండలంలో 38.6 మి.మీ., వట్టిచెరుకూరు 37.2, దుగ్గిరాల 36.8, చేబ్రోలు 34, తాడపల్లి 29.6, తుళ్లూరు 28.2, మంగళగిరి 27, పొన్నూరు 24, తెనాలి 18.2, తాడికొండ 14.8, పెదకాకాని 13.6, గుంటూరు తూర్పు 12.2, గుంటూరు పశ్చిమ 11.2, ప్రత్తిపాడు 9.8, పెదనందిపాడు 8.4, మేడికొండూరు మండలంలో 3.2 మి.మీ. చొప్పున వర్షం పడింది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,000 గరిష్టం : రూ. 3,000

మోడల్ ధర రూ. 2,500

మిర్చి యార్డు సమాచారం (బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	42282
అమ్మకాలు	44968
నిల్వ	7941

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,300
నంబరు-5	10,000-12,700
273	10,000-12,500
341	10,000-13,500
తాలుకాయలు	5,000-7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,600
బాడిగ-355	10,000 - 13,500
దేవనూరు డీలక్స్	10,000 - 13,800
తాలు	5,000 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు (బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 77

కొమ్ములు : 61 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,000	9,675	9,425

కాయలు : 16 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,000	9,675	9,425

మొత్తం అమ్మకాలు : 57.750 క్వింటాళ్లు